ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023
5
విజయనగరం



నగరపాలక సంస్థకు స్కోచ్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



దేశవ్యాప్తంగా నిర్వహించిన స్కోచ్ అవార్డుల ఎంపికలో విజయనగరం నగరపాలక సంస్థ రజత పతకం సొంతం చేసుకుంది. వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందించే విధానంలో శతశాతం నిర్వహణతో పాటు, పారదర్శకంగా అందించే విధానానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈమేరకు స్కోచ్ అవార్డుల కమిటీ శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థకు లభించిన రజిత పథకాల వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ శ్రీ రాములునాయుడు మీడియాతో మాట్లాడుతూ జాతీయస్థాయిలో రజిత పతకం సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో సంస్థకు మరిన్ని అవార్డులు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.



ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘాల నాయకులు

26న రైతుల ట్రాక్టర్ల ర్యాలీ

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఢిల్లీ పోరాటం విరమించిన సమయంలో రైతు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా బొబ్బిలిలో నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ కోరారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం అధ్యక్షతన అఖిలపక్షం సమావేశం జరిగింది. ఢిల్లీ పోరాటంలో అన్ని పంటలకూ స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేస్తామని హామీ ఇచ్చిన మోడీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. హామీలను అమలు చేసి రైతులు, కౌలు రైతులు రుణాలను, విద్యుత్ బిల్లు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అమార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ 26న ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీని రైతులంతా జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, అఖిలపక్షం రైతు సంఘం నాయకులు వి.లక్ష్మునాయుడు, టి.అప్పలనాయుడు, జి.సింహచలం, కర్రి అప్పలనాయుడు, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.శంకరరావు, కె.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెనుకబాటు?

- మందకొడిగా మెటీరియల్ కాంపొనెంట్ పనులు
- ఏటా రూ.వందల కోట్లు వెనక్కి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా మంజూరైన మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగంలో మళ్లీ వెనుకబాటే కనిపిస్తోంది. ఈ ఏడాది కూడా పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రూ.వందల కోట్లు వెనక్కిపోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఈఏడాది కూడా సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్కు సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు తదితర ప్రభుత్వ భవనాలు మరికొన్నాళ్లు మొండిగోడలతో వెక్కిరిస్తాయనడంలో సందేహం లేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు పొందిన సొమ్ముపై 60శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేంద్రం కేటాయించాల్సి ఉంటుంది. వీటిని ఉపయోగించుకోవడం జిల్లాలోని అధికారులు, పాలకులు ఏటా విఫలమౌతున్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఈ ఏడాది మొత్తానికి 1కోటీ 45లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 1కోటీ 41లక్షల పనిదినాలు కల్పించారు. ఇప్పటికే 97శాతం లక్ష్యం చేరుకున్నట్టు డ్వామా రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మన జిల్లాలో పెద్దగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఎక్కువమంది ఈ కూలి పనులపై ఆధార పడుతున్నారు. చదువుకున్న యువతీ, యువకులు కూడా ఈ పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జనవరి మెదటివారం వరకు జరిగిన పనికి సంబంధించి రూ.283.17 కోట్ల మేర కూలీలకు చేరింది. దీనిపై రూ.169కోట్లు (60శాతం) మేర మెటీరియల్ కాంపొనెంట్ పనులకు మంజూరైంది. ఇందులో ఇప్పటి వరకు వినియోగించుకున్నది కేవలం రూ.93కోట్లు మాత్రమే. మార్చిలోపు మిగిలిన రూ.76కోట్లు వినియోగించు కోవాల్సివుంది. ఇప్పటికే 97శాతం లక్ష్యం చేరుకోవడంతో గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు మిగిలివున్న మూడు శాతం పని దినాలకుతోడు అదనంగా మరో 30లక్షల పని దినాలు పూర్తిచేయాలని లక్ష్యం ఇచ్చారు. సంక్రాంతి పండగ గడిచిపోయిన నేపథ్యంలో పనులు కూడా ఊపందుకుంటాయి.

ఈ నేపథ్యంలో మరో రూ.50కోట్ల నుంచి రూ.60కోట్ల వరకు మెటీరియల్ కాంపొనెంట్ నిధుల ఖాతాలో జమ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీన్నిబట్టి మరో రెండు నెలల 15రోజుల్లో (మార్చి నెలాఖరులోగా) రూ.126 కోట్ల నుంచి రూ.136కోట్ల మేర ఖర్చు చేయాల్సివుంది. కానీ, పనులు చూస్తే నత్తనడకే నయం అన్నట్టుగా ఉన్నాయి. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు విడుదల కాకపోవడం వల్ల ముందుకు సాగలేక పోతున్నామని ఎక్కువ చోట్ల సంబంధిత కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీన్నిబట్టి కేంద్ర ప్రభుత్వం కూడా మన రాష్ట్రానికి రావాల్సిన మెటీరియల్ కాంపొనెంట్ నిధులను సకాలంలో విడుదల చేయడం లేదని, కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయడం లేదని కూడా స్పష్టమౌతోంది. ఇలాంటి ఇబ్బందుల తోనే గత ఏడాది 2021-22 సంవత్సరంలో విజయనగరం ఉమ్మడి జిల్లా నుంచి రూ.178కోట్లు వెనక్కి వెళ్లిపోయాయి. అంతకు ముందు కూడా రూ.వందల కోట్లు వెనక్కిపోయాయి. దీంతో, జిల్లా అభివృద్ధి కుంటుబడుతోంది.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు

గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి నరసింహారావు

ప్రజాశక్తి-బొబ్బిలి

గురుకుల పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి నరసింహ రావు అన్నారు. గురుకుల పాఠశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 గురుకుల పాఠశాలల్లో 21వేల మంది విద్యార్థులు, 10 జూనియర్, ఒక డిగ్రీ కళాశాలలో మూడు వేలమంది విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. నాడు-నేడు పథకంలో మౌలిక సౌకర్యాలు, తరగతి గదులు, డార్మెటరీ గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంతున్నట్లు చెప్పారు. ఆల్ పాస్ యాక్షన్ ప్లాన్ ఫార్ములాతో పని చేస్తున్నామన్నారు. వారాంతపు పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. కరోనాతో విద్యార్థులు చదువులో బాగా వెనుకబడ్డారని చెప్పారు. కొత్తగా 800 పోస్టులు భర్తీకి ప్రతిపాదనలు చేశామన్నారు. చదువుతో పాటు క్రీడలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సెలవు దినాలలో పూర్తిగా ఆటలపై దృష్టి పెడతామన్నారు. గురుకుల విద్యాలయాల్లో 30శాతం రెగ్యులర్, 70శాతం గెస్ట్, మేన్ పవర్ పద్దతిలో బోధనా, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారని చెప్పారు.



ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు

చిరుధాన్యాల వినియోగం పెరగాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ● మిల్లెట్స్ వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

ఆరోగ్యం కోసం ఆహారంలో చిరుధాన్యాల వినియోగాన్నిపెంచాలని, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కోరారు. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచి, తద్వారా పోషకాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ నెల 21,22 తేదీల్లో జరగనున్న చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా, ప్రజల్లో చిరుధాన్యాల వినియోగం పట్ల అవగాహన పెంచేందుకు, ఎపిఎఫ్‌పిఎస్ ఆధ్వర్యంలో, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఆనందగజపతి ఆడిటోరియం వరకు 2 కిలోమీటర్ల రన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ రన్‌ను కాంప్లెక్స్ వద్ద కోలగట్ల ప్రారంభించారు.

ఈ సందర్భంగామాట్లాడుతూ, చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగం, దాని ద్వారా కలిగే ప్రయోజనాలు, పిల్లలలో రక్తహీనత తగ్గించడమే లక్ష్యంగా మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. గత కొన్నేళ్లుగా చిరుధాన్యాల వాడకం తగ్గిందని, దీనివల్ల అనారోగ్యం బారిన పడుతున్నవారి సంఖ్య పెరిగిందని అభిప్రాయపడ్డారు. జగనన్న గోరుముద్ద, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ తదితర కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ఒకవైపు పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు మంచి పోషకాహారాన్ని అందించడమే కాకుండా, మరోవైపు చిరుధాన్యాల ఆవశ్యకతను రైతులకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలంటే, చిరుధాన్యాలను తప్పనిసరిగా ఉపయోగించాలని కోరారు. చిరుధాన్యాల ద్వారా కలిగే ప్రయోజనాలు, వాడే విధానం, లభించే పోషకాలపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి త్రినాధస్వామి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, మెప్మా పీడీ సుధాకరరావు, సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్, ఎపిఎఫ్‌పిఎస్ పీడీ సుభాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?

- ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బందిపై ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం
- పలు పాఠశాలల్లో తనిఖీలు
- మున్సిపల్ టీచర్‌పై సస్పెన్షన్ వేటు
- ఆర్‌జెడి సహా పలువురు ఇంజినీర్లకు ఛార్జి మెమోలు



బొబ్బిలి.. ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్

ప్రజాశక్తి-బొబ్బిలి, బొబ్బిలి రూరల్, రామభద్రపురం

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపడుతుంటే ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? అంటూ ఉపాధ్యాయులను, నాడు- నేడు పనులు చేపడుతున్న ఇంజినీరింగ్ అధికారులను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రశ్నించారు. బొబ్బిలి పట్టణంలోని మున్సిపల్ పాఠశాలను, పిరిడి, రామభద్రపురం జెడ్‌పి హైస్కూళ్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పిరిడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు, వర్కు బుక్‌లు పరిశీలించారు. జనవరికి ఒకటవ వర్కు బుక్ పూర్తి కావాల్సి ఉన్నా సగం కూడా పూర్తి చెయ్యక పోవడంతో ప్రధానోపాధ్యాయిని బోటు శ్రీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని మోనటరింగ్ చేయడానికి మీకు శిక్షణ ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఆమెకు చార్జీ మెమో ఇవ్వాలని ఆర్‌జెడిని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణకు ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ, డిఇఒ, ఆర్‌జెడిలు ఉన్నప్పటికీ పాఠశాలలు ఇలా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్య ప్రమాణాలు అధ్వానంగా ఉంటే సిబ్బందిపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. చర్యలు తీసుకోలేదని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అందరినీ సస్పెండ్ చేయాలా? అంటూ హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో ఆర్ఒ ప్లాంట్‌ను పరిశీలించారు. అది 40 రోజులుగా పని చెయ్యక పోవడం గుర్తించి నాడు-నేడు పనులు చూస్తున్న ఎఇ, డిఇ, ఇఇలకు జిల్లాలో ఇలాంటి ప్లాంట్‌లు ఉన్నాయని అడిగారు. వారు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారి ముగ్గురికి చార్జీ మెమోలు జారీ చేస్తామని తెలిపారు. మీలాంటి వారిని తీసేస్తే చాలా పోస్టులు ఖాళీలు అవుతాయని హెచ్చరించారు.

అంతకుముందు బొబ్బిలి పట్టణంలోని నరేంద్రదేవ్ మున్సిపల్ పాఠశాలను ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. 4వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్‌కు ప్రశ్నల వర్షం కురిపించారు. ఎస్ఎ-1 పరీక్షలలో విద్యార్థులకు మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించగా పరీక్ష పేపర్లు వ్యాల్యూషన్ చేయలేదని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌జెడి జ్యోతికుమారికి ఛార్జి మెమో జారీ చేస్తామని ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు.ఉద్యోగులలో మార్పు రావడం కోసమే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అనంతరం వీణల తయారీ కేంద్రాన్ని ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించారు. తయారీ దారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీణలను తయారు చేస్తున్నట్లు ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం గురుకులాన్ని సందర్శించి, గుర్తించిన లోపాలను ఈ నెలాఖరులోగా సరిచేయాలని సూచించారు. కమిటీ వచ్చి పరిశీలిస్తుందని, అప్పటికీ లోపాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముందస్తు సమాచారమున్నా ఎందుకంత నిర్లక్ష్యం?

ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తామని ముందస్తు సమాచారం ఇచ్చినా ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల తనిఖీపై తొమ్మిది రోజుల క్రితం సమాచారం ఇచ్చినా మార్పు రాలేదంటే క్షమించేది లేదన్నారు. తనిఖీలపై ఉపాధ్యాయులకు ముందస్తు సమాచారం ఇచ్చామని ఎంఇఒ లక్ష్మణరావు అన్నారు.

రామభద్రపురం వెళ్లి బొబ్బిలి తిరుగుముఖం

పట్టణంలో మున్సిపల్ పాఠశాలను ఉదయం 8గంటలకు తనిఖీ చేస్తామని ప్రకటించిన ప్రవీణ్ ప్రకాష్ రామభద్రపురం మండలం వెళ్లిపోయారు. పాఠశాలకు మరి రావడం లేదని సమాచారం రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే మార్గమధ్య నుంచి వెనుదిరిగి వచ్చి పాఠశాలను తనిఖీ చేశారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యా శాఖాధికారులు హడలిపోయారు.

నాణ్యమైన గుణాత్మక విద్యే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యే ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంస్కరణలు ప్రభుత్వం తీసుకు వస్తుందని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. రామభద్రపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ సూర్యకుమారితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మిడ్‌డే మీల్స్ వివరాలను ఎంఇఒను అడిగి వారు చెప్పిన లెక్కలు తన వద్ద నున్న రికార్డులతో సరిచూసి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఆర్‌జెడి కూడా తడబడి సక్రమ గణాంకాలు చెప్ప లేకపోవడంతో ఒకింత అసహనానికి గురయ్యారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్ పరిశీలించి పలు ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌జెడి జ్యోతి కుమారి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, ఎస్ఎస్ఎ ఎపిసి స్వామినాయుడు, డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు, బొబ్బిలి మండలం నాడు-నేడు ఎఇ శ్రీరామూర్తి, డిఇ వేణుగోపాల్‌రావు, ఇఇ కె.భాస్కరరావు, ఎంఇఒ లక్షణ రావు, రామభద్రపురం తహశీల్దార్ గణపతిరావు, ఎంపిడిఒ రమామణి, ఎంఇఒ తిరుమల ప్రసాద్, హెచ్ఎం కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

సిద్ధమైన అలుగోలు జెడ్‌పి హైస్కూల్ మైదానం ● హాజరు కానున్న 400 మంది క్రీడాకారులు



సిద్ధం చేసిన కబడ్డీ కోర్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా మరో సారి రాష్ట్ర అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలకు వేదికగా మారింది. నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈనెల 23 నుంచి 25వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. ఇటీవల నెల్లిమర్ల నియోజకవర్గం మహిళా కబడ్డీ జట్టు సిఎం కప్ పోటీలో లక్ష రూపాయల ప్రైజ్ మనీ గెలిచి సత్తా చాటారు. అదే స్ఫూర్తితో నెల్లిమర్ల మండలంలో అండర్ 17 బాల బాలికలు రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జిల్లా విద్యా శాఖ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు ఇప్పటికే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్ వి రమణ, అలుగోలు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు సారథ్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పాత 13 జిల్లాల నుంచి 26 బాల బాలికల జట్లు రానున్నాయి. మూడు రోజులు పాటు జరగనున్న పోటీలకు నాలుగు కోర్టులు సిద్ధం చేశారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు బాలురుకు జెడ్‌పి హై స్కూల్, బాలికలకు సతివాడ మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల లో వసతి ఏర్పాటు చేశారు. సుమారుగా 5లక్షలు వరకు ఖర్చు అయ్యే ఈ పోటీలను దాతలు సహకారంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం



కబడ్డీ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. పోటీలు ఆహ్లాదకరంగా జరిగే విధంగా అన్ని విభాగాల్లో జాగ్రత్తలు తీసుకున్నాం. కోర్టులు ఏర్పాటు, భోజనాలు, వసతి వంటి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. విజయ వంతంగా పోటీలు జరుగుతాయి.

- డిఇఒ లింగేశ్వర రెడ్డి

పోటీలను విజయవంతం చేయండి



మూడు రోజులు పాటు జరిగే కబడ్డీ పోటీలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి. ఇప్పటికే జిల్లా ప్రజాప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, కబడ్డీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. పోటీలకు వచ్చే క్రీడాకారులకు విజయనగరం నుంచి రవాణా సౌకర్యం ఏర్పాటు చేశాం. జిల్లా ప్రజలంతా సహకరించాలి.

- స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వి రమణ

ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు

డిఆర్‌ఒ గణపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన వుండాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు చెప్పారు. శకటాలను ప్రదర్శించే ప్రభుత్వ శాఖలన్నీ తమ శకటాల డిజైన్లను శనివారం సాయంత్రం కల్లా సమర్పించాలని సూచించారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై డిఆర్‌ఒ శుక్రవారం తన ఛాంబరులో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయా శకటాల్లో ఏయే అంశాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నదీ తెలియజేయాలన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ ఉత్పత్తుల విక్రయం కోసం కౌంటర్లు ఏర్పాటుచేసే ప్రభుత్వ శాఖలు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

తహశీల్దార్లతో రెవిన్యూ అంశాలపై సమీక్ష

జిల్లాలోని తహశీల్దార్లతో పలు రెవిన్యూ సంబంధ అంశాలపై డిఆర్‌ఒ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భూపట్టాల పంపిణీ, లబ్దిదారుల జాబితాల తయారీపై పలు సూచనలు చేశారు. శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలను మరోసారి సరిచూసుకోవాలని ఆదేశించారు.

వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం తగదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలన్న దురుద్దేశం ప్రతిపక్షాలకు తగదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో సచివాలయ వ్యవస్థను తీసుకురావాలని ఆయా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటే టిడిపి నాయకులు అక్కసు వెళ్ళగక్కుతున్నారని అన్నారు. సమావేశంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు తగవు

బాడంగి : వాలంటర్లపై తప్పుడు రాతలు సరికాదని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయడు అన్నారు. శుక్రవారం బాడంగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ పత్రిక, చానల్‌లో వచ్చిన వార్తలు చూస్తుంటే జరిగిన దానికి, వచ్చిన కథనాలకు పొంతన లేదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వాలంటీర్లపై తప్పుడు కథనాలు రాయడం సిగ్గుచేటన్నారు.

22న కరాటే, ఫుట్‌బాల్, రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 22న అండర్ 19 విభాగంలో ఫుట్‌బాల్, కరాటే, రోప్ స్కిప్పింగ్ ఎంపికలు స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరగనున్నాయని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు పట్టుకొని హాజరు కావాలని తెలిపారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

విజయనగరం : రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్ల సౌకర్యార్థం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వివిధ ఆసుపత్రుల నుంచి వైద్య నిపుణులు హాజరై డ్రైవర్లకు సేవలందించారు. రక్త నమూనాలు సేకరించి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి షుగర్, బిపి, నేత్ర సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాకు చెందిన 96 మంది వాహన డ్రైవర్లు, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొని వైద్య సేవలను పొందారు. డ్రైవర్లలో ఎనిమిది మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు పేర్కొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మెడికల్ క్యాంపు ద్వారా అందించే సేవలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రవాణా శాఖ ఉప కమిషనర్ వి.సుందర్ డ్రైవర్లకు, వాహనదారులకు సూచించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి శాఖ తరఫున సహాయం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిఒ ఆదినారాయణ, మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్‌లు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇనస్పెక్టర్లు, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


లోకాయుక్త కేసుల్లో సకాలంలో స్పందించాలి

ప్రజాశక్తి-విజయనగరం

లోకాయుక్త కేసుల్లో వచ్చిన నోటీసులపై సంబంధిత శాఖల అధికారులు సకాలంలో ఆయా కేసులు విచారణకు వచ్చే ముందుగానే సమాధానాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో విచారణకు రానున్న కేసులకు సంబంధించి నోటీసులకు జవాబులు ఇచ్చే అంశంపై శుక్రవారం తన ఛాంబర్ లో సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను తెలుసుకొని అధికారులకు సూచనలు చేశారు. కలెక్టరేట్ ఎఒ శ్రీకాంత్, విభాగాధికారి నీలకంటరావు పాల్గొన్నారు.

టిక్కెట్ నాదే.. గెలుపూ నాదే..

ఎమ్మెల్యే శంబంగి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బాడంగి

వచ్చే ఎన్నికల్లో టికెట్‌నాదే..గెలుపు నాదే అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో వైసిపి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తానే ఎమ్మెల్యేగా పోటీచేస్తానని, సందేహాలు వద్దని అన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో సమస్యలు, ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీను, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి బోగి గౌరి, తెంటు మధు సూదనరావు, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్రావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే జాతర విజయవంతం

డ్రోన్ కెమెరాలను ఉపయోగించండి : పార్వతీపురం మన్యం జెసి ఆనంద్

ప్రజాశక్తి - మక్కువ

అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శంబర పోలమాంబ అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు జెసి ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోకి వచ్చే రహదారులపై ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తుపై రేఖా చిత్రం ద్వారా సాలూరు సిఐ ధనుంజయరావు జెసికి వివరించారు. గత రెండేళ్ల జాతర కంటే ఈ ఏడాది భక్తులు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఇఒ రాధాకృష్ణను ఆదేశించారు. గ్రామంలో ఆలయానికి వచ్చే రహదారులను పరిశీలించారు. క్యూలైన్లను పరిశీలించారు.

పారిశుధ్యం పై దృష్టి పెట్టండి

గ్రామంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జెసి ఆనంద్ ఆర్‌డిఒ కె.హేమలతకు సూచించారు. జాతర నిర్వహణ అంతా పారిశుధ్యంపై ఎటువంటి ప్రభావం చూపబడ కూడదన్నారు. గోముఖీ నది ఒడ్డున క్యూలైన్ సమీపంలో ఉన్న పందుల గుడిసెలను వెంటనే తొలగించాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు జెసిను కోరారు. పంచాయతీ కార్యదర్శికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని ఆర్డీవో హేమలతకు జేసీ సూచించారు

700 మందితో పోలీసు బందోబస్తు

జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 700 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జాతరకు సంబంధించి పోలీస్‌శాఖ తీసుకుం టున్న చర్యలపై డిఎస్‌పి సుభాష్ జెసికి వివరించారు. గ్రామానికి అన్ని వైపులా 500 మీటర్ల దూరంలో వాహనాల నిలిపివేతకు పార్కింగ్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే అవాంఛనీయ సంఘటన జరగకుండా కొంతమందిపై బైండోవర్ కేసులు కూడా పెట్టామన్నారు.



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న పార్వతీపురం మన్యం జెసి ఆనంద్

పైపులైన్ కాజ్‌వేకు రూ.3లక్షలు మంజూరు

శంబర సమీపంలోని చెముడు వైపు వెళ్లే రహదారిలో గోముఖీ నదిపై రూ.3లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జెసి ఆనంద్ ఆర్ అండ్ బి అధికారులకు తెలిపారు. వెంటనే ఈ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామంలో ఆర్‌అండ్‌బి రహదారి పనులను పరిశీలించారు. సమస్యపై గత సమీక్షలో పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జెసి ఆదేశంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికినట్లు అయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మక్కువ ఎస్ఐ పైడిరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మిమ్స్ విద్యార్థి

ప్రజాశక్తి-నెల్లిమర్ల



వందన

మిమ్స్‌లో బిపిటి మొదటి సంవత్సరం చదువుతున్న రావాడ వందన విజయవాడలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు మార్చి 9 నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సెంట్రల్ యూనివర్సిటీలో జరగనున్నాయి. ఈ సందర్భంగా వందనను మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బిహెచ్‌వికె ప్రవీణ్ వర్మ, లైఫ్ ట్రస్టీ బిహెచ్ రామకృష్ణరాజు, డీన్ డాక్టర్ సిహెచ్ లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.వేణుగోపాలరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.రఘురాం, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, హోమియోపతి కళాశాల ప్రిన్సిపల్ డివిఎస్ శ్రీధర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ షంషీర్ బేగం, పీడీ కళావెంట్రావు అభినందించారు.



మరమ్మతులకు గురైన మోటార్‌ను పరిశీలిస్తున్న జెఇ సూర్యనారాయణ

కొప్పరలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

జెఇ సూర్యనారాయణ ● 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వంగర

కొప్పరలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సూర్యనారాయణ తెలిపారు. '1800 మందికి ఒక్క బోరే ఆధారం' అనే కథనం ప్రజాశక్తిలో శుక్రవారం ప్రచురణ కావడంతో స్పందించిన జెఇ కొప్పర గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు గురైన బోర్లను, తాగునీటి పథకం విద్యుత్తు మోటారును పరిశీలించారు. విద్యుత్తు సమస్య ఉందని గుర్తించిన ఆయన ఆ శాఖ ఎఇతో మాట్లాడారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రతిపాదన తయారు చేసి పంపుతామని జెఇ తెలిపారు. గ్రామంలో త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని వెల్లడించడంతో గ్రామస్తులు ప్రజాశక్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నేతాజీ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని నందిగాం పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసిని డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి శుక్రవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గరే మురళీమోహన్‌ను అభినందించారు. సచివాలయ ఉద్యోగుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎపిఎంకు అభినందన

ప్రజాశక్తి-రామభద్రపురం

స్త్రీనిధి రుణాలు మంజూరులో శత శాతం లక్ష్య సాధనకు కృషి చేసిన స్థానిక వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఎపిఎం గాడి వెంకట రమణకు ఆ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ స్త్రీ నిధి రుణం మంజూరు రూ.6.37కోట్లు లక్ష్యం కాగా ఇక్కడ సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసి ఇచ్చిన లక్ష్యం కన్నా అధికంగా రూ.6.50 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేయడం అభినంద నీయమని అన్నారు. రుణ వసూళ్ల కూడా పూర్తి చేసి మండలంలో అన్ని సంఘాలు ప్రగతి బాటలో పయనించేలా కషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి సావిత్రి, ఎజిఎం ఉమా మహేశ్వరి, ఎసి లక్షుం నాయుడు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

మండలంలో గుడివాడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన పిల్లలకు ఇస్తున్న మెనూ అమలుపై ఆరాతీశారు. అంగన్వాడీ కార్యకర్త, ఆయా పనితీరుపై ఎంపిడిఒ సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సచివాలయంలో వాలంటీర్ల పనితీరుపై ఆరాతీశారు. సిబ్బందికి పులు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

విఆర్‌ఒపై విచారణ

ప్రజాశక్తి-వేపాడ

సస్పెండ్ అయిన కెజిపూడి విఆర్ఒ వి.అప్పలనాయుడుపై శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటేశ్వర్లు ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. రైతులు, గ్రామస్తుల సమక్షంలో ఫిర్యాదుదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ విచారణలో డిటి సన్యాసినాయుడు, విఆర్ఒ అప్పారావు పాల్గొన్నారు.

కె.ఎ.నాయుడుకు టిడిపి నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడుకు నెల్లిమర్లకు చెందిన టిడిపి జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు.. శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, కొత్తపేట మాజీ సర్పంచ్ గురాన అసిరి నాయుడు, నాయకులు కోటపాటి తిరుపతి, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొంతు వెంకటరమణ, తంగుడిబిల్లి ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, రెల్లి వెంకటేష్ ఉన్నారు.

సన్యాసినాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండల సచివాలయ కన్వీనర్‌గా నియమితులైన జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడును శుక్రవారం కొండవెలగాడలో వైసిపి నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని, సచివాలయ వ్యవస్థను సమన్వయం చేసి మంచి ఫలితాలు తీసుకొస్తానని చెప్పారు. కార్యక్రమంలో తుమ్మలపేట వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, ఎంపిటిసి సంగంరెడ్డి జగన్నాథం, వైసిపి నాయకులు క్రోతు వెంకట రమణ, వాల్లే అప్పల నాయుడు, బెల్లాన రామారావు, కోట్ల కృష్ణ, సంగంరెడ్డి సాంబ, తర్లాడ శంకరరావు, మాజీ సర్పంచులు యడ్ల గోవిందరావు, నేతేటి అప్పలనాయుడు, నాయకులు మొయిద ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-బొబ్బిలి



కాలిపోతున్న గడ్డికుప్పలు

పట్టణంలోని పాత బొబ్బిలి సమీపంలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు వరి గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. ధాన్యం నూర్పిడి చేసిన తర్వాత వరి కుప్పలకు నిప్పంటడంతో మంటలు చెలరేగాయి. గడ్డికుప్పలు సమీపంలో ధాన్యం బస్తాలు ఉన్నాయి. ధాన్యం బస్తాలను అక్కడే ఉన్నవారు దూరంగా తరలించడంతో ధాన్యానికి నష్టం జరగలేదు. వరి గడ్డి కుప్పలకు నిప్పు అంటిన వెంటనే స్థానికులు మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగే సమయానికి అగ్నిమాపక యంత్రం వచ్చి పూర్తిగా అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో పాతబొబ్బిలికి చెందిన వై. జయరాం, వై. బాలాజీ వరి గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి.

ఫోరెన్సిక్ సైకాలజీతో లోతుగా నేర పరిశోధన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఫోరెన్సిక్ సైకాలజీతో లోతుగా నేర పరిశోధన చేయవచ్చని జైన్ విశ్వవిద్యాలయానికి చెందిన అనీషా చంద్రన్ అన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఫోరెన్సిక్ విభాగంలో వర్చ్యువల్ విధానంలో నిర్వహించిన 'క్రిమినల్ ప్రొఫైలింగ్ - ఫ్యూచరస్టిక్ అప్రోచ్ ఇన్ బిహేవియరల్ ఎవిడెన్స్ ఎనాలిసిస్' అనే వెబినార్‌కు ఆమె ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోరెన్సిక్ విభాగంలో విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యంతో కూడిన విధానాలను అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, పారామెడికల్ డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విభాగాధిపతి విలాస్ చవాన్, ప్రవల్లిక, భువనేశ్వర్ క్యాంపస్ డీన్ అమూల్య రత్న బెహరా, శ్రీ నాగ పాల్గొన్నారు.

చుక్కమాంబ తీర్థం ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెంలో గ్రామ దేవత చుక్కమాంబ తీర్థం శుక్రవారం ప్రారంభమైంది. జనం అధికసంఖ్యలో ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

టిడిపి, జనసేన దొందూ దొందే



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-రేగిడి

టిడిపి, జనసేన దొందూ దొందేనని, చంద్రబాబు, పవన్ పార్టీలను ప్రజలు నమ్మవద్దని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్‌పి మాట్లాడారు. టిడిపి హయాంలో ఆ పార్టీ కార్యకర్తలే జేబులు నింపుకున్నారని తెలిపారు.. దత్త పుత్రుడైన పవన్ కళ్యాణ్ ప్యాకేజీలకే పరిమితమని విమర్శించారు. పేదలే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించే దిశగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్‌పి బెల్లాన

ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముందుగా ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఉద్యోగుల గైర్హాజరుపై ఎమ్‌పి మండిపాటు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు గైర్హాజరుపై ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మండిపడ్డారు. పలు సమస్యలపై ప్రజలు, సర్పంచులు, ఎంపిటిసిల నుంచి వచ్చిన వాటికి సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంతో ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావును ప్రశ్నించారు. తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, జెఇ రామకృష్ణ, హౌసింగ్ ఎఇ సూర్యప్రకాశరావు, ఎపిఎం మంగమ్మ, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు తప్ప మిగతా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.. గడపగడపకు కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే చర్యలు తప్పని ఎమ్‌పి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ధార అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కన్వీనర్ పాలవలస రామచంద్ర నాయుడు, నాయకులు లెంక రాంబాబు, కెంబూరు వెంకటేశ్వరరావు, తుమ్మి వెంకటరమణ, కెల్ల మన్మథరావు, శ్రీనివాసరావు, మొయ్యి చక్రపాణి, బాబూరావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన కర్మ వైసిపి

మాజీమంత్రి పతివాడ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్రానికి పట్టిన కర్మ వైసిపి ప్రభుత్వమేనని, దీనిని వదిలించుకోవాలని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని పారసాం, బూరాడపేట గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సాకులు చూపించి పింఛన్లు, సంక్షేమ పథకాలు అన్యాయంగా తీసివేశారని పలువురు ఆయన వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం పతివాడ మాట్లాడుతూ పథకాల అమలు చేతకాక కుంటుసాకులతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, పింఛన్లు నిలిపేయడం దారుణమన్నారు. పింఛన్లు పెంపుదల చేస్తున్నామని చెప్పి ఉన్న పింఛన్లు తొలగించడం సరికాదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జాడ లేదని చెప్పారు. ప్రతిపక్షాలను అణగదొక్కడానికి చీకటి జిఒ 1ని తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, పతివాడ తమ్మునాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు అవనాపు సత్యనారాయణ, బొంతు వెంకట రమణ, గురాన అసిరినాయుడు, కోటపాటి తిరుపతి రావు, తంగుడుబిల్లి ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, టెక్కలి, పారసాం సర్పంచుల నేతేటి స్వామినాయుడు, గొలజాన నారాయణ రావు, నాయకులు బెల్లాన రాజినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. ర్యాలీ చేస్తున్న టిడిపి శ్రేణులు

అప్పులపాలు కావడానికేనా సలహాదారులు?

టిడిపి నాయకులు గొంప కృష్ణ

వేపాడ : రాష్ట్రం అప్పులపాలు కావడానికేనా సలహాదారులను ప్రభుత్వం నియమిస్తోందని టిడిపి నాయకులు, ఎన్‌ఆర్‌ఐ గొంప కృష్ణ ఎద్దేవాచేశారు. శుక్రవారం వేపాడలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోర్టులు తప్పు పడుతున్నప్పటికీ ప్రభుత్వం తీరు మాత్రం మారలేదన్నారు. అప్పులు తేవడానికి ఒకరు, వాటిని ఎగ్గొట్టడానికి సలహా ఇచ్చేందుకు మరొకరు, గొడవలు సృష్టించడానికి ఇంకొకరు, అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించడానికి వేరొకరు.. ఇలా ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క సలహాదారుడిని ప్రభుత్వం నియమించిందని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని దివాలా తీయిస్తూ ప్రజలను దోచుకోవడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తూ ప్రజల నెత్తిన అప్పుల భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి మాత్రం ప్రభుత్వం నియమించిన సలహాదారులు పనికిరారని ఆక్షేపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను విడనాడి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు.

ధాన్యం కొనుగోళ్లలో చిత్తశుద్ధి కరువు

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

కొత్తవలస : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. కొత్తవలసలోని టిడిపి విశాఖ పార్లమెంట్ బిసి కమిటీ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. రైతుల కష్టాలు చూసి, వారి బాధలను తీర్చేవారే కనిపించడం లేదన్నారు. జగన్ రెడ్డి పాదయాత్రలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. వైసిపి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, తెలుగు రైతు పార్లమెంట్ అధ్యక్షులు తిక్కాన చిన దేముడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ, అయ్యారక సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు బంగారు రమేష్, చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారామపాత్రుడు, సీనియర్ నాయకులు లాలం అర్జునరావు పాల్గొన్నారు.

ఏనుగుల స్వైర విహారం

సచివాలయ తలుపులు ధ్వంసం ● భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పరజపాడు సచివాలయం తలుపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. గురువారం రాత్రి ఏనుగులు ప్రధాన రహదారి గుండా వచ్చి రహదారి పక్కనే ఉన్న సచివాలయం తలుపులను రాత్రి సమయంలో ధ్వంసం చేసి వెళ్లిపోయాయి. ఏనుగులు సచివాలయం లోపలికి వెళ్లలేకపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదని, లేకుంటే వేలాది రూపాయల విలువ చేసే కంప్యూటర్లు పాడయ్యేవని సచివాలయ పంచాయతీ కార్యదర్శి ఆర్ రాజగోపాల్ తెలిపారు. ఏనుగులు ఇలా స్వైరవిహారం చేస్తుండడంతో గ్రామాల్లోకి ఏ రాత్రి సమయంలోనైనా ప్రవేశించి ఇళ్లను కూడా ధ్వంసం చేస్తాయేమోనన్న ఆందోళన ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా జనవరిలో ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు ఏనుగుల బారినపడి చనిపోతున్నారని, కావున వీటి నుంచి రక్షించాలంటూ ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఏనుగుల సంచారం వల్ల భయంతో పొలం పనులకు వెళ్లలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఎటు నుంచి వస్తాయో తెలియడం లేదని, వ్యవసాయ పనుల సమయములో మళ్లీ ఏనుగులు ఈ ప్రాంతానికి రావడం వల్ల పనులను చేపట్టలేకపోతున్నామని రైతాంగం విలవిలలాడుతున్నారు. ఏనుగుల బారిన పడకుండా ప్రభుత్వం, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన సచివాలయ తలుపులు

నిషేధంపై ఉన్న ఆసక్తి.. ప్రత్యామ్నాయంపై ఏదీ?

అధికారుల తీరుపై ఫ్లెక్స్ ప్రింటర్ అసోసియేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఫ్లెక్సీల నిషేధంపై అధికారులకు ఉన్న ఆసక్తి, తమకు ప్రత్యామ్నాయం చూపించడంలో లేదని ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆక్షేపించింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం కలెక్టర్ ఇచ్చిన ప్రకటనను ఖండించారు. 19న కలెక్టరేట్‌లో సమావేశానికి జిల్లాలోని ఫెక్సీ ఓనర్లంతా వెళ్తే, తమను కనీసం లోనికి రానివ్వకుండా రిజిస్టర్‌పై సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. ఒకరిని లోపలికి పిలిచి 'మీతో మాట్లాడేంత సమయం మాకు లేదు. జిఒ కాపీ ఇస్తాం. వెయిట్ చేసి పట్టుకెళ్లాలి' అంటూ ఏకపక్ష నిర్ణయం తీసుకొన్నారని వాపోయారు. కనీసం తమ సమస్యను వినే ప్రయత్నం చేయలేదని ఆవేదన చెందారు. ప్రభుత్వం చేసే అడ్డగోలు జిఒలు అమలు చేయడానికేనా అధికారం?. ప్రజల బాధలు వినే అవసరం లేదనటం ఎంతవరకు సమంజసం? అంటూ ప్రశ్నించారు. తమకు ఇస్తామన్న ఆర్థిక సాయం ఇంతవరకు అందించలేదని,. బ్యాంకులను సంప్రదిస్తే ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులూ లేవని చెబుతున్నారని తెలిపారు. మరోవైపు మిషన్లకు సహకరించే ఫ్యాబ్రిక్ క్లాత్ అందుబాటులోకి తీసుకురాలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జిఒ 65ను విడుదల చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎక్స్‌పోలో కానీ, అవగాహన సదస్సులో కానీ ఎటువంటి ప్రత్యామ్నాయాలు చూపించలేదని పేర్కొన్నారు. వెంటనే జిఒ 65ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపైనే మురుగునీటి నిల్వ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస గ్రామంలో ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా మురుగునీరు నిల్వ ఉంటోంది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మురుగునీటిలో నుంచే వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. రోజుల తరబడి మురుగునీరు అలాగే ఉంటున్నా, అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కరకవలస గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు

రహదారి భద్రతతో ప్రాణాలు సురక్షితం

ప్రజాశక్తి-విజయనగరం

రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలోఈసు అధికారులు మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించడం వల్ల వాహనదారుల ప్రాణాలు సురక్షితంగా ఉంటాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో, లారీ డ్రైవర్లకు స్థానిక వైద్యులతో ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ప్రమాదాల నియంత్రణకు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

రామభద్రపురం : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆటో,లారీ, వ్యాన్ డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాద రహిత డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లకు స్థానిక పిహెచ్‌సిలో నేత్ర పరీక్షలు చేయించారు. డ్రైవింగ్ చేసే వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యవంతునిగా ఉంటేనే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చిన్నయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

గజపతినగరం : రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సిఐ ఎల్.అప్పలనాయుడు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తూ గజపతినగరం సర్కిల్ పరిధిలో శుక్రవారం మహిళా పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, బస్సు ఆగినప్పుడు మాత్రమే ఎక్కడం, దిగడం చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ఎస్ఐ సి.హెచ్.గంగరాజు, బొండపల్లి ఎస్ఐ ఎస్.రవి పాల్గొన్నారు.





రామభద్రపురం, గజపతినగరంలో ర్యాలీ చేపడుతున్న పోలీసులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఐలు తారకేశ్వరరావు, లోవరాజు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆటో, క్యాబ్, స్కూల్ బస్ డ్రైవర్లకు సంజీవని ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఎస్.కోట పోలీస్‌స్టేషన్ మైదానంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు నెలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సుమారు 50 మందికి డాక్టర్ బాలాజి పరీక్షలు చేశారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన హోర్డింగ్‌లు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రాజా కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు ఎస్ఐబి సిఐ జైభీమ్ ఆధ్వర్యాన శుక్రవారం హోర్డింగ్‌లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురలవాట్లపై అవగాహన కల్పించేందుకు సామాజిక బాధ్యతగా అన్ని కళాశాలలు ముందుకొచ్చి భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చల్లా వీరేంద్ర కుమార్, వైస్ ప్రిన్సిపల్ రమేశ్, కెమిస్ట్రీ హెచ్‌ఒడి నాగేంద్ర కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఈశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.